
సాక్షి పల్నాడు

సోమవారం । 30 । అక్టోబర్ । 2023




డెల్టాకు 4,808 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు ఆదివారం 4808 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 202 క్యూసెక్కులు వదులుతున్నారు.



ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణా నికి వీరాంజనేయులు, ధనలక్ష్మి దంపతులు రూ.1,27,116 విరాళంగా ఆదివారం అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 525.00 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ఇద్దరు సీఐలు బదిలీ

నగరంపాలెం(గుంటూరువెస్ట్): గుంటూరు రేంజ్ పరిధిలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పీఎస్ సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.శేషగిరిరావుని బాపట్ల జిల్లా చీరాల ఒన్ టౌన్ పీఎస్‌కు, బాపట్ల జిల్లా చీరాల రూరల్ పీఎస్ సీఐ ఎ.మల్లికార్జునరావుని గుంటూరు జిల్లా తాడేపల్లి పీఎస్‌కు బదిలీ చేశారు.

దుర్గమ్మకు బంగారు ముత్యాలహారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా, విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు బంగారు ముత్యాల హారాన్ని కానుకగా సమర్పించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన బి.సతీష్‌కుమార్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి 113 గ్రాముల బంగారు ముత్యాల హారాన్ని కానుకగా సమర్పించింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

రూ.21 లక్షలు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు

పెనమలూరు: సైబర్ నేరగాళ్లు ఒక వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి రూ.21 లక్షలు స్వాహా చేయటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... యనమలకుదురు సాయినగర్‌కు చెందిన మోటుపల్లి రఘురామ్ అజంతా ఫార్మసీ లిమిటెడ్ కంపెనీలో సీనియర్ రీజినల్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా ఈ నెల 13వ తేదీన విశాఖపట్నం వెళ్లాడు. ఆ సమయంలో ఆయనకు 07980118947 నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాను ఐసీఐసీఐ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని ఖాతాను ఈకేవైసీ చేసి అప్‌డేట్ చేయాలని చెప్పాడు. వాట్సాప్‌కు లింకు పంపాడు. రఘురామ్ అది నిజమేనని నమ్మి లింకు క్లిక్ చేశాడు. కొద్ది సమయం తరువాత రూ.2,00,995 లావాదేవి జరిగినట్లు కన్ఫర్మేషన్ కాల్ వచ్చింది. వచ్చిన రికార్డు కాల్‌లో 1వ నంబర్ నొక్కితే కనఫర్మేషన్ చేసినట్లు, 9వ నంబర్ నొక్కితే అకౌంట్‌బ్లాక్ చేసినట్లు తెలిపింది. దీంతో రఘురామ్ అనుమానం వచ్చి బ్లాక్ చేయటానికి 9వ నెంబర్ బటన్ నొక్కాడు. ఆ తరువాత ఓటీపీలు రావటంతో బ్యాంకుకు వెళ్లి వివరాలు అడిగాడు. ప్రీఅప్రూవ్డ్ లోన్ రూ.15 లక్షలు, క్రెడిట్ కార్డు లిమిట్ రూ.1.25 లక్షల నుంచి రూ.6 లక్షలు పెంచామని బ్యాంకు అధికారులు తెలిపారు. మొత్తం రూ.21 లక్షలు సైబర్ నేరగాళ్లు రఘురామ్ బ్యాంకు ఖాతా నుంచి డ్రా చేశారు. రఘురామ్ లింక్ క్లిక్ చేసిన తరువాత అతని ఫోన్ నెట్‌వర్కు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కటంతో ఆయనకు తెలియకుండానే బ్యాంకులోన్ మంజూరు చేయించుకొని, క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకొని సొమ్ము కాజేశారు. ఈ ఘటన పై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రేపు ఎస్టీ గురుకుల పాఠశాల ప్రారంభోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి.రాజన్న దొర మంగళవారం పట్టణానికి రానున్నారు. పట్టణంలోని సత్యనారాయణపురంలో రూ. 2.32 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల భవనాన్ని ఈనెల 31వ తేదీన సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొననున్నారు.

ముగిసిన అథ్లెటిక్ పోటీలు

పటమట(విజయవాడతూర్పు): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ చెన్నై రీజనల్ ఆధ్వర్యంలో పటమట ఎన్ఎస్ఎం స్కూల్లో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల అథ్లెటిక్ క్లస్టర్–7 పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో 80 పాఠశాల నుంచి 450 విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో పోటీల కో ఆర్డినేటర్ మహేంద్రన్ మాట్లాడుతూ చదువులతో పాటు ఆటల్లో కూడా ప్రతిభ చాటాలన్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, జావలిన్‌త్రో విభాగాల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పోటీల్లో తిరుచానూరుకు చెందిన డీడీపీ స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, హైదరాబాద్‌కు చెందిన సెయింట్ ఆండ్రూస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో ఏడీపీ పాఠశాలకు చెందిన ఆర్.చరణ్ ప్రథమ స్థానం, ఖమ్మం హార్వెస్ట్ స్కూల్‌కు చెందిన బడ్డి వైశాలి ద్వితీయ స్థానం, హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన శివాజీ రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు.

తెల్ల బంగారం ధరహాసం

- పత్తికి కనీస ధర రూ.7,020
- ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు
- ఆశాజనకంగా ధరలు
- రైతుల్లో ఆనందం



గ్రామాలలో పత్తి కాటా వేస్తున్న కూలీలు

అమరావతి: పత్తి రైతుకు మంచిరోజులొచ్చాయి. గతంలో విత్తు నుంచి అమ్మకం వరకు కష్టాలు పడేవారు. పంట ధర చూసి బిక్కంమొఖం వేసిన రోజులున్నాయి. పట్టించుకునే నాథుడే ఉండేవారు కాదు. కొనుగోళ్ల పేరుతోనూ గోల్‌మాల్‌కు పాల్పడిన సందర్భాలున్నాయి. మద్దతు ధర కోసం ఏళ్ల తరబడి ఎదురుచూశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చారు. విత్తనం నుంచి పంట చేతికొచ్చే వరకు ఆర్బీకేలను ఏర్పాటు చేసి మద్దతుగా నిలిచారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే క్వింటా మద్దతు ధర రూ.7,020 ప్రభుత్వం ప్రకటించింది. దీంతో బహిరంగ మార్కెట్ లోనూ అధిక ధరకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు.

పల్నాడు జిల్లాలో సాగు ఇలా..

జిల్లాలో కృష్ణా నది పరీవాహక ప్రాంతం, నాగార్జున సాగర్ కాలువల ద్వారా మాత్రమే సాగునీటి వసతి ఉంది. మిగిలిన ప్రాంతాలలో చెరువుల కింద, కాలువల కింద నీటి వసతి బట్టి మిరప, మినుము, కూరగాయ పంటలను సాగు చేస్తుంటారు. జిల్లాలో వర్షాధార పంటగా నూటికి 90 శాతం మంది రైతులు పత్తి పంటనే సాగు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలలో కలపి గతేడాది సుమారుగా 1.21 లక్షల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. ఈ ఏడాది జిల్లాలో సాగు విస్తీర్ణం 53,938 హెక్టార్లలో మాత్రమే నమోదైంది. ఐదేళ్ల కిందట సుమారు 12.5 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చిన రైతులు నష్టాలు చవిచూశారు.

దిగుబడి తగ్గినా..

ఈ ఏడాది తొలి నుంచి పత్తి సాగు రైతు కష్టాలు పడ్డాడు. వర్షాకాలంలో పడిన ర్షాలకు పత్తి ఏపుగా పెరిగి దిగుబడులు వస్తాయనుకున్నారు. ఆ దశలో సెప్టెంబరు, అక్టోబరుల్లో వర్షాలు వెనుకాడాయి. దీంతో దిగుబడులపై ప్రభావం పడింది. జిల్లాలో నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో అక్కడక్కడ 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడులు వచ్చినప్పటికి ఎక్కువ శాతం ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి. ఈ ఏడాది ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.7,020గా ప్రకటించింది. తొలి పత్తికి కూడా రూ.6,500 పైనే రేటు పలకటం, ఆరుదల పత్తికి రూ.7,000 నుంచి 7,500 పలుకుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

దళారులకు చెక్

గతంలో రైతులకు జిల్లాలో ఉన్న మార్కెట్ యార్డులలో పత్తి కొనుగోళ్లు నిర్వహించాలంటే సీసీఐ మార్గదర్శకాలు రావాలి, వారి నిబంధనలకు అనుగుణంగా పత్తిని క్వింటాలుకు అదనంగా రూ.20 నుంచి 50 ఖర్చుపెట్టి మార్కెట్ యార్డులకు తరలిస్తే అక్కడ వారు నిర్ణయించిన రేటు ప్రకారం రైతులకు చెల్లింపులు చేసేవారు. నేడు గిట్టుబాటు ధర కల్పించటంతో బహిరంగ మార్కెట్ నిబంధనలను ప్రభుత్వం సరళతరం చేయటంతో గ్రామాలలో దళారులు కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పత్తి కొనుగోలు చేస్తున్నారు. దీంతో దళారులు నాణ్యత సరిగా లేదని, తేమశాతం ఎక్కువగా ఉందని సాకు చూపి రైతులను మోసం చేసే అవకాశం కూడా లేకుండా పోయింది. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరలు ఏ రోజుకా రోజు అందిస్తుండటంతో సాకులు చూసి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేయాలన్నా వ్యాపారుల ఆటలు సాగటం లేదు.

గిట్టుబాటు ధరతోనే ఊరట



ఈ ఏడాది 15 ఎకరాల పత్తి సాగు చేస్తున్నా. మొదట్లో అదునుకు వర్షాలు పడటంతో పత్తి మొక్కల పెరుగుదల బాగుంది. తరువాత వాతావరణంలో మార్పులు, వానలు వెనుకాడటంతో మొదటికాపు మాత్రమే కాసింది. దిగుబడి రాకపోయినా ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరతో మేలు. అలాగే తొలి పత్తి నుంచి అరుదల పత్తి వరకు మంచి రేటుకు కొనుగోలు చేస్తున్నారు. వచ్చే ఏడాది కూడా పత్తి సాగు చేయవచ్చనే ధైర్యం వచ్చింది.

జెట్టి నాగరాజు, రైతు, జూపూడి

మద్దతుతో గట్టెక్కాం



గతేడాది పత్తిని గులాబి పురుగు దెబ్బతీసింది. ఈఏడాది నాలుగు ఎకరాలు సాగు చేశా. సమయానికి వర్షాలు పడలేదు. దిగుబడులు తగ్గే పరిస్థితి ఉంది. ఈ ఏడాది నష్టాలు తప్పవనుకునే సమయంలో గిట్టుబాటుధర ప్రకటించటంతో పత్తితోనే ఈ ఏడాది గట్టెక్కాం.

–రమావత్ రామారావునాయక్, రైతు, పెదమద్దూరు



చంద్ర గ్రహణ వీక్షణం

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

అర్ధరాత్రి 1.48 గంటలు | అర్ధరాత్రి 1.55 గంటలు | అర్ధరాత్రి 2.07 గంటలు | అర్ధరాత్రి 2.16 గంటలు | అర్ధరాత్రి 2.44 గంటలు

గిరిదుర్గంపై ఇక జలవిహారం

- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడి
- కొండవీడులో రాత్రి బస, సాహస క్రీడలు
- ట్రయల్‌రన్‌లో మరబోట్లు–3, ఫెడల్‌బోట్లు–2
- బోటింగ్‌కు రుసుం రూ.100, రూ.50



బోటింగ్ డెక్‌పై కలెక్టర్ శివశంకర్

యడ్లపాడు: కొండవీడుకోట సందర్శన మధురానుభూతిని కలిగించేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా పర్యాటకులకు అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొండవీడుకోటను జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావుతో కలసి కలెక్టర్ కుటుంబ సభ్యులు సందర్శించారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా శనివారం రాత్రి కొండలపైనే టెంట్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఫైర్‌క్యాంపులో పాల్గొని అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు వివరాలు తెలుసుకున్నారు. రాత్రి టెంట్లలో అక్కడే నిద్రించి మరుసటి రోజైన ఆదివారం ఉదయాన్నే అడ్వెంచర్స్ ప్రొగ్రామ్స్‌లో భాగస్వామ్యం అయ్యారు. చెరువుల వద్ద వాకింగ్, చక్కని వ్యూ పాయింట్ అయిన చుక్కల బురుజుపై ట్రెక్కింగ్‌తో పాటు పలు సాహస క్రీడల్లో అధికారులు పాల్గొన్నారు.

బోటింగ్ ట్రయల్‌రన్..

పర్యాటక అభివృద్ధిలో భాగంగా కొత్తగా తెచ్చిన కయాకింగ్స్(పొడవైన పడవలు), ఫెడల్ బోట్స్ పరిశీలించారు. అనంతరం వెదుళ్ల చెరువులో అధికారులు తొలి ట్రయల్ రన్‌గా బోట్ షికారు చేశారు. కొండవీడు సందర్శనకు వచ్చిన పర్యాటకులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు ఇంకా కల్పించాల్సిన వాటిపై వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండవీడుకు వచ్చే పర్యాటకుల కోసం మూడు కయాకింగ్, రెండు ఫెడల్‌బోట్లను తీసుకురావడం జరిగిందని చెప్పారు. కొండలపై ఆహ్లాదకర వాతావరణంలో విశాలమైన వెదుళ్ల చెరువులో జలవిహారం చేసేందుకు వీటిని మరో వారం రోజుల్లో అందుబాటులోకి వస్తాయని వివరించారు. కయాకింగ్‌కు రూ.100, ఫెడల్‌బోటింగ్‌కు రూ.50 చొప్పున(పెద్దలు, పిల్లలకు) రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. త్వరలో క్యాంటీన్, రెస్ట్‌హౌస్ సౌకర్యాలను కూడా చేరువ చేయనున్నట్లు వెల్లడించారు.

ఉత్తమ బోధనకు సాంకేతికత జోడింపు



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఐఎఫ్ ప్యానెల్ ద్వారా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో టెక్నాలజీ విద్య
- బ్లాక్ బోర్డు స్థానంలో ఐఎఫ్‌పీల ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయులు
- పాఠ్యాంశాలను ప్రత్యక్షంగా తిలకిస్తూ అభ్యసనం
- ఇంటర్నెట్ సదుపాయంతో కార్పొరేట్ తరహా బోధన
- జిల్లాలోని 175 పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. నాడు–నేడు పథకంలో సకల సౌకర్యాలు కల్పించింది. దీనితో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా బోధనకు ప్రాధాన్యం ఇస్తోంది. అందుకు సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించి విద్యార్థులను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంది. ఇప్పటికే అవసరమైన శిక్షణను ఉపాధ్యాయులకు ఇచ్చింది.

ఐఎఫ్‌పీ విధానంలో..

ఆధునిక విద్యాబోధనకు కేరాఫ్‌గా నిలిచిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)ను పాఠశాలల్లో అమలుకు శ్రీకారం చుట్టింది. 2023–24 విద్యా సంవత్సరంలో పాఠశాలలు పునః ప్రారంభం నాటికి బ్లాక్ బోర్డుకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీలు ఆధునిక విద్యాబోధనలో అత్యుత్తమ ఫలితాలు నమోదు చేస్తున్నాయి. గుంటూరు జిల్లాలోని 175 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 624 ఐఎఫ్‌పీల ద్వారా విద్యార్థులు ఆధునిక విద్య అభ్యసిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి క్లాస్‌రూమ్‌కు ఒకటి చొప్పున ఐఎఫ్‌పీ ప్యానెల్ అమర్చారు. ఈ విధంగా ఒక పాఠశాలకు ఐదు నుంచి 10 వరకు ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. రూ.1.26 లక్షల వ్యయం కలిగిన అత్యాధునిక ఐఎఫ్‌పీలను ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసింది. ఐఎఫ్‌పీలకు ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా ఉపాధ్యాయులు తాము పాఠ్య పుస్తకంలో చెబుతున్న పాఠ్యాంశాలను విద్యార్థులకు టచ్ స్క్రీన్ ద్వారా అక్కడికక్కడే ప్రత్యక్షంగా చూపించి, వారికి అర్థమయ్యే విధంగా వివరిస్తున్నారు.

కార్పొరేట్ స్థాయిలో ఆధునిక బోధన



నాడు–నేడు ద్వారా మా పాఠశాలను నగరంలోనే మోడల్ పాఠశాలగా ప్రభుత్వం తీర్చిదిద్దింది. తరగతి గదుల్లో తొమ్మిది ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేసింది. విద్యాబోధనపై ఉపాధ్యాయులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆధునిక వసతులతో సాగిస్తున్న విద్యాబోధన తీరు, తెన్నులపై తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా ఉన్నారు.

బి.విజయలక్ష్మి, హెచ్ఎం, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, గుంటూరు

నేర్చుకుంటూ బోధన సాగిస్తున్నాం



ఐఎఫ్ ప్యానెల్స్ ద్వారా విద్యాబోధన చేయడంలో ఉపాధ్యాయులుగా మేము ప్రతి రోజూ కొత్తగా నేర్చుకుంటూ విద్యార్థులకు కొత్త విషయాలను చెబుతున్నాం. టెక్నాలజీతో కూడిన విద్యాభ్యాసంపై విద్యార్థులు ఎంతో మక్కువతో ఉన్నారు. విద్యార్థినులు టచ్‌స్క్రీన్ ద్వారా పాఠ్యాంశాలను వెతకడం, విజ్ఞానం పంచే వీడియోలను తిలకించడం స్వయంగా చేస్తున్నారు.

కె. ఉషారాణి, సోషల్ టీచర్

సులభంగా నేర్చుకుంటున్నాం



తరగతి గదిలో టీచర్ చెప్పిన పాఠాన్ని తిరిగి, ఐఎఫ్ ప్యానెల్ ద్వారా పునశ్చరణ చేస్తున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన పాఠం చెబుతున్న సమయంలో దానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు చూపిస్తున్నారు. ఈ విధంగా చదువుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నాలుగేళ్ల క్రితం మా పాఠశాలలు ఇటువంటి సదుపాయాలు చూడలేదు.

ఎ.సంయుక్త, పదో తరగతి విద్యార్థిని

కిక్కిరిసిన దుర్గమ్మ కొండ

- గ్రహణానంతరం అమ్మవారికి స్నపనాభిషేకం
- ఉదయం 8 గంటల నుంచి దర్శనం ప్రారంభం



వేకువనే అమ్మవారి దర్శనం కోసం మహా మండపం వద్ద వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పాక్షిక చంద్ర గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం 8 గంటలకు దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇతర ఉపాలయాల్లో దేవతా మూర్తుల దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు (కవాట ఉద్ఘాటన) ఆలయ ద్వారాలను తెరిచిన అర్చకులు సంప్రోక్షణ అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు అమ్మవారిని తొలి దర్శనం చేసుకుని పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 8 గంటలకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ఘాట్‌రోడ్డు, మహా మండపం వద్ద భక్తుల రద్దీ

ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఉదయం 8 గంటల తర్వాతే అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని దేవస్థానం మైక్‌లో ప్రచారం చేసింది. అయితే భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం వద్దకు పెద్ద ఎత్తున చేరుకోవడంతో వారిని నిలువరించడం సెక్యూరిటీ సిబ్బందికి తలకు మించిన భారమైంది. దీంతో భక్తులను కొండపైకి అనుమతించారు. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ. 500 క్యూలైన్‌లో కొండపైకి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆదిదంపతులకు ఆర్జిత సేవలు

గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం 7 గంటల తర్వాత ప్రారంభయ్యే ఆర్జిత సేవల్లోకి ఉభయదాతలను అనుమతించారు. లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణాలతో పాటు లోక కల్యాణార్థం, సర్వ మానవాళి శ్రేయస్సును కాంక్షిస్తూ నిర్వహించిన సూర్యోపాసన సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్‌మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

ఆదివారం ఉదయం 8 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించడంతో ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రద్దీ కనిపించింది. మధ్యాహ్నం 11.40 గంటలకు అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అన్ని దర్శనాలు నిలిపివేశారు. మహా నివేదన అనంతరం తిరిగి 12.20 గంటలకు దర్శనాలు ప్రారంభం కాగా, ఆ రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. మరో వైపున సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

నేటి నుంచి కానుకల లెక్కింపు..



అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

దసరా ఉత్సవాలలో అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను సోమవారం నుంచి లెక్కించనున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు మహా మండపం 6వ అంతస్తులో కానుకల లెక్కింపు ప్రారంభమవుతుంది. వచ్చే నెల 2వ తేదీ వరకు కానుకల లెక్కింపు కొనసాగుతుందని ఆలయ అధికారులు ప్రకటించారు.

నయన మనోహరం.. సంప్రదాయ నృత్యం



గరగ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న త్రినాథాచారి బృందం

విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలు, మృదంగ విద్వాంసుడు పీవీ వరప్రసాద్‌కు శీరం సుబ్రహ్మణ్యం స్మారక పురస్కార ప్రదానం, నాన్నా నేనొచ్చేశా సాంఘిక నాటిక ప్రదర్శించారు. తొలుత నాట్యాచార్యుడు మాగలూరి త్రినాథాచారి బృందం పలు అంశాలను ప్రదర్శించింది. అనంతరం మృదంగ విద్వాంసుడు పీవీ వరప్రసాద్‌కు శీరం సుబ్రహ్మణ్యం స్మారక పురస్కార ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణ, దృశ్యవేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్, దృశ్యవేదిక ఉపాధ్యక్షుడు దొంతాల ప్రకాష్, సాంస్కృతిక కార్యక్రమాల ఐక్యవేదిక అధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు, బొర్రా నరేన్ పాల్గొన్నారు. చివరిగా అమృత వర్షిణి థియేటర్ ఆర్ట్స్ సమర్పణలో అమృత లహరి దర్శకత్వంలో సామాజిక అంశాలు, కుటుంబ వారసత్వం, మానవ సంబంధాలు అంశంగా నాన్నా నేనొచ్చేశా సాంఘిక నాటికను ప్రదర్శించారు.

క్లుప్తంగా

అనంతలక్ష్మి నూలుమిల్లుకు అవార్డు



యద్దనపూడి: బోయపాలెం గ్రామంలోని అనంతలక్ష్మి నూలు మిల్లుకు ప్రతిష్టాత్మక 'ఇండియా ఎస్ఎంఈ -100' అవార్డు లభించిందని మిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏటా అందించే ఈ అవార్డుకు ఏపీ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక పరిశ్రమ తమదేనని వెల్లడించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఎస్ఎంఈ ఫోరం పదో వార్షిక వేడుకల్లో భాగంగా మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సామినేని ఫణికుమార్ జ్యూరీ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకున్నట్లు చెప్పారు. దేశంలోని 31,842 పరిశ్రమలు దరఖాస్తు చేసుకోగా వాటిలో టాప్-100 కేటగిరీలో ఈ అవార్డు దక్కడం యాజమాన్యం, సిబ్బంది, కార్మికుల కృషి ఫలితమేనని చెప్పారు.

నేడు రెండు చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

నరసరావుపేట: జిల్లాలో రెండు చోట్ల సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష(జేఏఎస్) వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి ఆదివారం వెల్లడించారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని గారపాడు జెడ్పీహెచ్ఎస్ స్కూలు ఆవరణతోపాటు, పిడుగురాళ్ల సంజీవరెడ్డి నగర్‌లోని పార్కు స్కూలు ఆవరణలో వైద్యశిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూడు పూరిళ్లు దగ్ధం
రూ.8 లక్షల ఆస్తి నష్టం



చీరాల అర్బన్: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మూడు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన చీరాల రూరల్ మండలం వాడరేవు గ్రామంలో ఆదివారం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది వివరాల మేరకు.. వాడరేవు గ్రామంలోని లైట్‌హౌస్ పక్కన ఉన్న పూరిళ్ల వద్ద బాణసంచా నిప్పురవ్వలు ఎగసి పడడంతో మంటలు చెలరేగాయి. తీరం వద్ద గాలుల ప్రభావంతో ఒక్కసారిగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఫలితంగా గల్లా బంగారయ్య, సిరిపిల్లి రాజారావు, కోవూరి వీరరాజుకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో వలలు, రూ.70 వేల నగదు, బంగారం కాలి బూడిదయ్యాయి. మొత్తం రూ.8 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

చేసిన పాపాల వల్లే బాబు జైలుపాలు

- 2024 తర్వాత ఆంధ్రాలోనూ టీడీపీ చేతులెత్తేస్తుంది
- నాపై దాడి చేస్తే భయపడేది లేదు
- పవన్ మన వాడు కాదు.. బాబు దగ్గర పనివాడు
- రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు ధ్వజం



ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): చంద్రబాబునాయుడు చేసిన పాపాలే ఆయనను జైలుపాలు చేశాయని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో ఆదివారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' సన్నాహక కార్యక్రమంలో మంత్రి అంబటి మాట్లాడుతూ వ్యవస్థలను మేనేజ్ చేసి బాబును జైల్లో ఉంచామని లోకేష్ మాట్లాడుతున్నారని, ఇప్పటి దాకా వ్యవస్థలను మేనేజ్ చేసింది ఎవరో తెలుసుకోవాలన్నారు. పిన్నమ్మను తీసుకుని అమిత్‌షా కాళ్ళు పట్టుకున్న లోకేష్.. ఏం మేనేజ్ చేయాలనుకున్నారో ప్రజలకు తెలుసునన్నారు. ఆయన సమర్థుడైతే భార్య, తల్లి బయటకు రావాల్సిన అవసరం లేదన్నారు. లోకేష్ వద్ద సరుకు లేదని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్కిల్ కేసులో బలమైన సాక్ష్యాలు ఉన్నాయి కాబట్టే బాబుకు బెయిల్ రావటం లేదన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు 50 రోజులు కాదని, బాబు కారాగార శత దినోత్సవాలు జరుపుకుంటారని జోస్యం చెప్పారు. తెలంగాణలో టీడీపీ చేతులెత్తేసిందని, 2024 ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోనూ చేతులెత్తేస్తుందని, పార్టీ చివరి ఘడియల్లో ఉందని అంబటి ఎద్దేవా చేశారు. మాట తప్పకుండా, మడమ తిప్పకుండా పారదర్శకంగా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తట్టుకోలేక, ఆయన ముందు నిలబడే శక్తి లేక, ఆయనకు అండగా నిలిచిన తనపై ఫ్రస్ట్రేషన్‌తో దాడులు చేస్తున్నారని, దాడులు చేసిన వాళ్లంతా ఆ సామాజిక వర్గం వారేనని, దాడులకు భయపడేది లేదని వైఎస్సార్ సీపీ కోసం ఎంత దూరమైనా వెళ్తానని అంబటి స్పష్టం చేశారు.

పవన్ రాజకీయాలకు పనికిరాడు

పవన్ కళ్యాణ్ మా వాడు.. మా వాడు అని కాపు సామాజికవర్గమంతా అనుకుంటోందని, పవన్ మన వాడు కాదని.. చంద్రబాబు దగ్గర పనివాడని గుర్తు పెట్టుకోవాలని అంబటి పేర్కొన్నారు. పవన్ రాజకీయాలకు పనికిరారని స్పష్టం చేశారు. చంద్రబాబుతో కలిసి పోటీ చేస్తే కుక్కతోక పట్టుకొని సముద్రం ఈదినట్టేనని ఎద్దేవా చేశారు. ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేసి, నిరంతరం ప్రజల్లో ఉండి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో పార్టీని గెలిపించాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారూరి పద్మ, జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలే ఆదర్శనీయుడు

విగ్రహావిష్కరణ సభలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: భారతీయ సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పొన్నూరు సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని పూలే విగ్రహాన్ని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సభకు మాల మహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు అధ్యక్షత వహించారు. ఎంపీ వెంకటరమణారావు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్నారని అన్నారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో అన్ని వివక్షలను రూపుమాపి సమానత్వం కావాలని ఆశించిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. బీసీలందరూ ఐక్యంగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసి చారిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. దేశ చరిత్రలో పూలేకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మిన వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అనిఅన్నారు. మహాత్ముల అడుగుజాడల్లో నడుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. పొన్నూరు పట్టణంలో గత పాతికేళ్ల టీడీపీ హయాంలో చేయని ఎన్నో అభివృద్ధి పనులు నాలుగున్నరేళ్ల కాలంలో చేసి చూపించామన్నారు. త్వరలో పొన్నూరు ప్రధాన రహదారిని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ దాత మాకాని రమేష్ బాబు, మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్ల, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, బీసీ నాయకులు కొల్లేరు శ్రీనివాసరావు, పెరికల కృష్ణమోహన్, జీడీసీఎంఎస్ డెరెక్టర్ కుర్రా పాములు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

31న అద్దంకిలో ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 31న అద్దంకి ఒలంపియన్ స్పోర్ట్స్ అకాడమీ మార్కెట్ యార్డు రెండో గోడౌన్‌లో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, అండర్-11, అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నా. పూర్తి వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ విష్ణుప్రసాద్ 8121820000ను సంప్రదించాలని సూచించారు.

అభాగ్యులకు బజరంగ్ నేత్రజ్యోతి బాసట

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- శలపాడులో 716 మందికి నేత్ర వైద్యపరీక్షలు



నేత్ర పరీక్షలకు వచ్చిన గ్రామస్తులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: తన సంక్షేమపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ ప్రదాతగా నిలిచారని, రాష్ట్రంలో ఎవరు ఎలాంటి సేవా కార్యక్రమం చేయాలని తలపెట్టినా అన్నింటా - అంతటా జగనన్న స్ఫూర్తి నిండి ఉంటుందని బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో ఆదివారం బజరంగ్ నేత్ర జ్యోతి కార్యక్రమాన్ని అంబటి మురళీకృష్ణ స్థానికులతో కలిసి ప్రారంభించారు. శలపాడులో జరిగిన సమావేశంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అక్షరాస్యత ఎక్కువగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో నేత్ర సమస్యలపై అవగాహన ఉంటుందని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి కారణంగా అత్యధిక శాతం పాక్షికంగా అంధత్వం బారిన పడుతున్నారన్నారు. కంటిచూపును పాక్షికంగా కోల్పోయిన వారికి పూర్తిగా చూపు నశించకుండా రక్షణ కల్పిస్తూ, తిరిగి వెలుగును ప్రసాదించే బృహత్తర కార్యక్రమంగా బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి రూపుదిద్దుకుందన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమం వెనుక అంతర్లీనంగా జగనన్న స్ఫూర్తి నిండి ఉందన్నారు. బజరంగ్ సామాజిక సేవా విభాగ బృందం సభ్యులు గత రెండు రోజులుగా శలపాడులో ఇంటింటికి కరపత్రాలతో వెళ్లి గ్రామస్తులను శిబిరానికి సాదరంగా ఆహ్వానించారు. ప్రత్యేకంగా ఆటోలను ఏర్పాటు చేసి, రాకపోకలను నిర్వహించారు. ఈ శిబిరంలో 716 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఏడు పనిదినాలలో వ్యక్తిగత కళ్లజోళ్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ట్రై కాన్ క్లినిక్స్, గుంటూరు వారి సహకారంతో 95 మంది గ్రామస్తులకు ఫిజియోథెరపీ సేవలు అందించడం జరిగింది. ప్రముఖ నేత్ర వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



మృతురాలు షేక్ ముంతాజ్‌బేగం (ఫైల్)

చిలకలూరిపేటటౌన్: మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కృష్ణమహల్ సెంటర్‌కు చెందిన షేక్ ముంతాజ్‌బేగం (47) టిడ్కో గృహాల్లోని బ్లాక్ నంబర్ ఏ-64 మూడో అంతస్తులో టీ-10 ఫ్లాట్‌లో మృతి చెందింది. ఫ్లాట్ నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం రాత్రి అర్బన్ సీఐ సి.సీతారామయ్య వెళ్లి తలుపులు పగలగొట్టారు. గదిలో ముంతాజ్‌బేగం అనుమానస్పదంగా మృతి చెంది కనిపించింది. ఆమె మూడు రోజుల కిందట మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కృష్ణమహల్ సెంటర్‌లో నివాసం ఉండే ఆమెకు టిడ్కో గృహాల్లో ఒక ఫ్లాట్ కేటాయించారు. వంట పని చేసుకుంటూ జీవనం సాగించే ఆమె అప్పుడప్పుడు టిడ్కో గృహాలలోని ఫ్లాట్‌కు వస్తుండేదని చెబుతున్నారు. వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఈ ఘాతుకం జరిగిందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ముంతాజ్ భర్త మాబుమియా ఐదేళ్ల కిందట మరణించాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తల్లి ఆదాంబీ ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా కరుణాకర్‌రెడ్డి, రఘురాం



సహకార ఉద్యోగుల మహాసభలో మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలతోపాటు రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో అసోసియేషన్ రెండో రాష్ట్ర మహాసభలు ఆదివారం జరిగాయి. ఈ మహాసభల్లో అసోసియేషన్ నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎస్.రంగబాబు, ఏఐబీఈఏ కార్యదర్శి ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, చలసాని మాధవరావు, వి.రాధాకృష్ణమూర్తి, కేవీఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గం..

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా బండి కరుణాకర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జె.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బొల్లినేని రఘురాం, ముఖ్య ఉపాధ్యక్షుడిగా నీలం నాగేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాజామోహిద్దీన్, కోశాధికారిగా ఎస్.కొండలశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గం..

ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ నరసింహారావు, ఉపాధ్యక్షులుగా కె.వెంకటేశ్వరరావు, ఎం.మార్కండేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పి.రామశేష ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొండల శర్మ, కోశాధికారిగా ఎస్.హరికృష్ణ, గౌరవ సలహాదారుగా జి.వీరభద్ర రావు ఎన్నికయ్యారు.

ఏలూరు జిల్లా కార్యవర్గం..

ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా జి.ఎస్.వి.రామారావు, ప్రధాన కార్యదర్శిగా నీలం శ్రీనివాసరావు, కోశాధికారిగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ప్రభుత్వ విప్ ఎల్.అప్పిరెడ్డి



కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి

గుంటూరు వెస్ట్: ప్రజల అవసరార్థం తలపెట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డిని కోరారు. ప్రభుత్వ విప్ అయిన తర్వాత అప్పిరెడ్డి తొలిసారి ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తలపెట్టిన కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో శస్త్ర చికిత్సలు, దీర్ఘకాలిక చికిత్సలు అవసరం అయినవారిని ఆరోగ్య శ్రీ ద్వారా త్వరగా చేయించేందుకు ప్రత్యేక వ్యవస్థతో అనుసంధానం చేయాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గుర్తించిన పనులను మరింత వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే స్పందనలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ప్రతి నెలా స్పందన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఇటీవల వర్షపాతం కొంత తక్కువైనా రైతులకు ఇబ్బంది కలగకుండా చేపట్టిన చర్యలపై కలెక్టర్‌ను అప్పిరెడ్డి అభినందించారు. ప్రభుత్వ విప్ చెప్పిన సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

పోస్టల్ శాఖ కబడ్డీ రాష్ట్ర జట్టుకు క్రీడాకారుల ఎంపిక



ఎం.గిరిబాబు



ఎస్.ఉమామహేశ్వరరావు



బి.సురేష్‌రెడ్డి



కె.చక్రధర్‌రెడ్డి

చినగంజాం: అఖిల భారత పోస్టల్ కబడ్డీ టోర్నీ రాష్ట్ర జట్టుకు నలుగురు చినగంజాం క్రీడాకారులు ఎంపికయ్యారు. 35వ అఖిల భారత పోస్టల్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టులో చినగంజాంకు చెందిన ఎం.గిరిబాబు (ఎల్ఎస్‌జీ ఎస్పీఎం) ప్రకాశం భవన్ పోస్టాఫీస్, ఎస్ ఉమామహేశ్వరరావు (పోస్ట్ మ్యాన్) చినగంజాం సబ్ పోస్టాఫీస్, కె.చక్రధర్‌రెడ్డి (చీరాల హెడ్ పోస్టాఫీస్), బి.సురేష్‌రెడ్డి (ఆర్ఎంఎస్, ఒంగోలు) స్థానం సంపాదించారు. ఎర్నాకులంలో ఈనెల 30, 31 తేదీల్లో, నవంబర్ 1,2 తేదీల్లో నాలుగురోజుల పాటు నిర్వహించే టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టులో వీరు పాల్గొంటారు. వీరిని ప్రకాశం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ కార్యాలయాలు హరి ప్రసాద్ శర్మ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డిలు వారిని అభినందించారు.

అవగాహనతో పక్షవాతానికి చెక్ పెట్టొచ్చు

న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ



ర్యాలీలో పాల్గొన్న న్యూరాలజిస్టులు, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: పక్షవాతంపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండటం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పక్షవాతం బారిన పడకుండా ఉండొచ్చని సీనియర్ న్యూరాలజిస్ట్, న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా ఆదివారం గుంటూరులో ఏపీ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పక్షవాతంపై అవగాహన ర్యాలీ, మెగా వాకథాన్ జరిగింది. అవగాహన ర్యాలీని డాక్టర్ విజయ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్‌వరకు ర్యాలీ కొనసాగింది. న్యూరాలజిస్టులు, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీలో పక్షవాతంపై పోస్టర్లు, ఫ్లెక్సీలు, అవగాహన ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. లలితా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు పక్షవాతంపై ప్రజలకు అవగాహన కల్పించేలా లఘునాటిక ప్రదర్శించారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వల్ల నేడు యుక్తవయస్సులోనే స్ట్రోక్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలు స్ట్రోక్ బారిన పడకుండా వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అసోసియేషన్ గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ వి.రామతారక్‌నాథ్ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పుల ద్వారా స్ట్రోక్ బారిన పడకుండా ఉండొచ్చన్నారు. కోశాధికారి డాక్టర్ చక్కా శివరామకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో స్ట్రోక్ ముప్పునుంచి తప్పించుకోవచ్చని పేర్కొన్నారు. జీజీహెచ్ న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ కుమారి ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయటం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. డాక్టర్ జి.చందన, డాక్టర్ ఎస్.కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ ఆర్.బాలకృష్ణనాయక్, డాక్టర్ పిడికిటి బాలకృష్ణ, డాక్టర్ ఘంటా శ్రీనివాస్, డాక్టర్ పి.రాజేంద్ర కుమార్, డాక్టర్ ఎం.భార్గవి, డాక్టర్ మధు, అభిషేక్, షాహిద్, రామాచారి, అరుణ్‌కుమార్, రాఘవేంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లవరపు సాహిత్యం వెలకట్టలేనిది

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్



డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయవాడ కల్చరల్: డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు సాహిత్యం వెలకట్టలేనిదని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. జానుడి సాహిత్య వేదిక, మల్లవరపు జాన్ సాహిత్య భారతి ఆధ్వర్యంలో కవి సాహితీ విమర్శకుడు డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు 5 వర్ధంతి ఆదివారం నిర్వహించారు. సాహిత్యోపన్యాసం, మల్లవరపు రాజేశ్వరరావు కవితా పురస్కారాలు ప్రదానం బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించారు. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కవిగా రాజేశ్వరరావు ఎంతోమంది యువ కవులను ప్రభావితం చేసినట్లు తెలిపారు. ఆయన సాహిత్యం నేటి యువ కవులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జాషువా లాంటి కవులు నేటి సమాజానికి అవసరమన్నారు. మల్లవరపు రాజేశ్వరరావు సాహిత్య గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ స్వరూపరాణి రాజేశ్వరరావు సాహిత్య జీవితం అంశంగా ప్రసంగించారు. మల్లవరపు ప్రభాకరరావు, సాహితీవేత్తలు బండ్ల మాధవరావు, వేంపల్లి షరీఫ్, అనిల్ డ్యానీ, తంగిరాల సోని తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు. డాక్టర్ ప్రసాద మూర్తి, డాక్టర్ పెరుగు రామకృష్ణ, అనిల్ డ్యానీ, రాఘవేంద్ర, గరిక పాటి మణీందర్, నేలపూరి రత్నాజీ, పుష్పాల శ్రీరాం, సాంబమూర్తి, సోమేపల్లి వశిష్ట, తుల శ్రీనివాసులు, వైష్ణవిశ్రీ, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావుకు కవితా పురస్కారాలు ప్రదానం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ స్కూల్ అమ్మబడును. తెనాలి, చెరుకుపల్లిలో గల రన్నింగ్ స్కూల్ అమ్మబడును. ఆసక్తి గల వారు వెంటనే సంప్రదించండి. ఫోన్ : 8885140325

REAL ESTATE

PLOT FOR SALE

■ దీపావళి Spl Offer : రిజిస్ట్రేషన్ చార్జెస్ ఫ్రీ. ఇంద్రవనం @ అద్దంకి 22 సెంట్స్ 90 మొక్కలతో డ్రిప్ ఇరిగేషన్ సదుపాయంతో ధర కేవలం రూ.7 లక్షలు మాత్రమే. ఫోన్ : 89781 62222

SERVICES

BUSINESS OFFER

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact: for more info: 7569560745

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్. (100% జెన్యూన్) సంప్ర॥ ✆ 99413 66669

WANTED

■ అర్జెంటుగా కావలెను. GNT, Ch Pet, NRT, TNL, RPL, PTP, VNK, BPT మరియు చుట్టు ప్రక్కల గ్రామాలలో మహిళలు ప్రవేటు బ్యాంకులలో పనిచేయుటకు కావలెను. 73868 79373

■ Hostel Incharge లు, Class Incharge లుగా Work చేయుటకు పురుషులు కావలెను. జీతం: 10000/- to 18000/- ఇవ్వబడును. మరియు ఉచిత భోజనం, వసతి కల్పించబడును. విద్యార్హతలు: Inter, Degree, Age: 23+, ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు. Master Minds. ఫోన్: 91000 24070

■ గుంటూరు మా ల్యాబ్‌లో పనిచేయుటకు ఆసక్తికరమైన యువతీ యువకులు కావలెను. మరియు చెరుకుపల్లి, మాచర్ల ఆఫీసుల నందు పనిచేయుటకు కలెక్షన్ ఏజెంట్ కావలెను. కనీస అర్హత: 10+2 సంప్ర॥ సెల్: 98660 92977

■ బార్ & రెస్టారెంట్ నందు పనిచేయుటకు వెయిటర్లు, వంటమాస్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్స్, క్యాషియర్ కావలెను. రూం+భోజన వసతికలదు: 8578271161, 8143198968

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్న వారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీసు వర్క్. సంప్ర: 9963255441

■ తెనాలిలోని ప్రముఖ కాలేజీ హాస్టల్‌లో 50 మందికి వంట చేయుటకు వంట వారు కావలెను. వైష్ణవి జూనియర్ కాలేజి, స్టేషన్ రోడ్, తెనాలి. సంప్ర॥ 9290769284

■ Wanted girls aged 18-24years to work as Sales girls in a jewellery SHowroom, Uttam Jewellers, Main Road, Fruit Market, Lalapet Guntur. Cont: 9700311201

■ ప్రముఖ కంపెనీ కోసం ప్రతి గ్రామం నుండి యువతీ/యువకులు కావలెను. P/T: 12000/- F/T:25000 & అకౌంటెంట్ కావలెను. 6/2 అరండల్‌పేట, Gnt: 7386886833, 8290399839

■ ప్రముఖ పాలడైరి నందు మార్కెటింగ్‌చేయుటకు గుంటూరు, తెనాలి మరియు పొన్నూరు ప్రాంతాల వారిగా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆసక్తి గల వారు సంప్ర॥: 9949148192

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926

■ P&G Company (Vicks, Tide, Gillette) కంపెనీలో గుంటూరు, నరసరావుపేట, తెనాలి, రేపల్లె, గురజాల Locationలో పనిచేయుటకు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. Salary 15K to 20K with Any Degree (Two Wheeler Mandate). గుంటూరు, నరసరావుపేట Locationలో పనిచేయుటకు సేల్స్ టీం లీడర్స్ (M/F) కావలెను. Salary 20K to 30K with Any Degree (Two Wheeler Mandate). గురజాల, నరసరావుపేటలో బ్రాంచి ఇంఛార్జి Any Degree with Excel knowledge. తెనాలిలో కంప్యూటర్ ఆపరేటర్ Any Degree with Excel knowledge. గుంటూరు, నరసరావుపేటలో డెలివరీ బాయ్స్, మర్చండైజర్స్ (M) with 10th qualification. Salary 13K to 14K ✆ 82973 12348, 95812 34542, 95812 34504

■ రామకృష్ణ గ్రూప్స్ (AP No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పనులకు. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91608 91122, 92814 52838

■ స్టార్ హోమ్ కేర్ HYD వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్ ఇంటి/వంట పనికి స్త్రీలు కావలెను. జీతం: 18K-25K, రూం+భోజనం ఉచితం. ఏజెంట్ కమీషన్ కలదు. ఫోన్: 84904 82881, 86398 28228

■ బాపట్ల జిల్లా, వేమవరం గ్రామంలోని త్రినేత్ర ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ గ్రానైట్ కంపెనీలో పనిచేయుటకు ఈ క్రింది ఖాళీలు కలవు. 1) సూపర్‌వైజర్స్-3Nos. Q : ఇంటర్ మీడియట్ (లేక) మెట్రిక్, 2) అసిస్టెంట్ ఎకౌంటెంట్స్-2 Nos., అర్హత : B.Com, 3) ఫిట్టర్-2Nos. అర్హత ITI (or) Fitter, 4) గ్యాంగ్ శ్రీ క్రేన్ ఆపరేటర్స్-2 Nos., 5) మల్టీ కట్టర్ ఆపరేటర్స్-2 Nos. 6) పాలిషింగ్ ఆపరేటర్స్-2 Nos. వాక్-ఇన్ ఇంటర్వ్యూ: 30-10-2023, 31-10-2023 లలో సంప్రదించండి. ✆ 70135 60520, 91009 32446

■ ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. ఫోన్ : 7396856819, 7386886819

సాక్షి క్లాసిఫైడ్స్ — గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే — ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే — ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం — ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం — గుంటూరు: 97030 13015, 97034 67843, 92904 02000

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, [illegible] డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ [illegible] విషయమై గమనించగలరు.